క్లుప్తంగా

నేడు కడవ-బోనాలు

తలకొండపల్లి: మండల పరిధిలోని చెన్నారం సమీపంలో వెలిసిన మల్లప్పగుట్ట మల్లికార్జున స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం మధ్యాహ్నం కడవ-బోనాలు కార్యక్రమం ఉంటుందని ఆలయ నిర్వాహకులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా దర్శనానికి వచ్చే భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు మాజీ ఉప సర్పంచ్ జక్కు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకోవాలి



చిన్నారుల నృత్య ప్రదర్శన

ఆమనగల్లు: విద్యార్థులు చిన్ననాటి నుంచే క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకుంటే బంగారు భవిష్యత్ సాధ్యమని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పాండు అన్నారు. శుక్రవారం పట్టణంలోని వివేకా విద్యాభారతి ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం 30వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థులలో మానసిక, శారీరక దృఢత్వాన్ని పెంచుతాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ మహమూద్, కరస్పాండెంట్ గోలి శ్రీనివాస్, డైరెక్టర్ ఏవీ శర్మ, శివలింగం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ప్రధాన కార్యదర్శిగా జంగయ్య

షాద్‌నగర్: ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా చటాన్‌పల్లి గ్రామానికి చెందిన సింగపాగ జంగయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సికింద్రాబాద్‌లోని ప్యారడైజ్ హోటల్‌లో గురువారం రాత్రి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సింగపాగ జంగయ్యను రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఇటుక రాజు మాదిగ ఆయనకు నియామక పత్రం అందజేశారు. అనంతరం జంగయ్య మాట్లాడుతూ గ్రామ స్థాయిలో ఎమ్మార్పీఎస్‌ను మరింత బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు.

పండ్లకు భలే డిమాండ్

పెరిగిన ధరలు

మొయినాబాద్: మహాశివరాత్రి సందర్భంగా శుక్రవారం పండ్లకు డిమాండ్ పెరిగింది. మొయినాబాద్‌లో శివరాత్రి సందర్భంగా ప్రత్యేకంగా పండ్ల షాపులు ఏర్పాటు చేశారు. ఉపవాసం చేసిన భక్తులు దీక్ష విరమించి పండ్లు మాత్రమే తింటారు. దీంతో పండ్ల ధరలు అమాంతం పెరిగాయి. అరటి పండ్లు డజన్ రూ. 70 నుంచి80, ద్రాక్షా కిలో రూ.100, నలుపు ద్రాక్షా కిలో రూ.150, తర్బూజా కిలో రూ.100, ఆపిల్స్ రూ.100కు రెండు, వాటర్ మిలన్ రూ.100 నుంచి 150, ఆరేంజ్ రూ.100కు మూడు, దానిమ్మ రూ.100కు రెండు విక్రయిస్తున్నారు. గతేడాదికంటే ఈసారి పండ్ల ధరలు ఎక్కువగానే పెరిగాయని కొనుగోలు దారులు పేర్కొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

పట్టణ సీఐ ప్రతాప్‌లింగం

షాద్‌నగర్: భక్తుల దాహార్తిని తీర్చే విధంగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని షాద్‌నగర్ పట్టణ సీఐ ప్రతాప్‌లింగం అన్నారు. మహాశివరాత్రి సందర్భంగా మండల పరిధిలోని రామేశ్వరంలో నిర్వహిస్తున్న జాతరలో జిల్లా సాధన సమితి అధ్యక్షుడు ఎమ్మె సంతోష్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని శుక్రవారం సీఐ ప్రారంభించి మాట్లాడారు. భక్తుల దాహార్తిని తీర్చేలా చలివేంద్రం ఏర్పాటు చేయడం హర్షనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో సమితి కార్యదర్శి దర్గా వెంకటేష్, ఆవ జగన్, మహిపాల్‌రెడ్డి, సూర్య, కార్తీక్, శ్రీ చరణ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి

చైతన్యపురి: కాలనీలోని డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి అన్నారు. తమ కాలనీలో సరైన భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ లేక ఇబ్బందులు పడుతున్నామని డివిజన్‌లోని మైత్రినగర్ కాలనీవాసులు కార్పొరేటర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన శుక్రవారం సదరు కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు డ్రైనేజీ నీరు కాలనీ రహదారులపై ప్రవహిస్తుండటంతో కాలనీలో దోమలు బెడద అధికమైందని, దుర్గంధ పూరిత వాతావరణంతో అవస్థలు పడుతున్నామని కాలనీవాసులు రామిరెడ్డి, వేణు కార్పొరేటర్‌కు వివరించారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లి డ్రైనేజీ సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తానని కార్పొరేటర్ వారికి హామీ ఇచ్చారు.



మహేశ్వరం శివగంగ ఆలయంలో భక్తుల కోలాహలం



తుక్కుగూడ: రావిర్యాలలో శివరాత్రి వేడుకలో చిన్నారులు

వైభవం.. శివోత్సవం



మీర్‌పేట: జిల్లెలగూడలోని శివాలయంలో నృత్య ప్రదర్శన



మహేశ్వరం: కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

శివ నామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. ఉదయం నుంచే భక్తులు స్వామి వారి దర్శనానికి బారులు తీరారు. అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షలు చేపట్టి ఆలయ ప్రాంగణాల్లో భక్తులు విరమించారు. నియోజకవర్గ వ్యాప్తంగా శివాలయాలు కిటకిటలాడాయి.

- మహేశ్వరం శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు
- శివరాత్రి సందర్భంగా శివాలయాలు భక్తులతో కిటకిట

మహేశ్వరం: మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీశివగంగ రాజరాజేశ్వర ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు కనుల పండువగా సాగాయి. ఉదయం నుంచే ఆలయంలో శివపార్వతులు, గంగాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. ఉపవాస దీక్షలు విరమించడానికి భక్తులు భారీ ఎత్తున క్యూలైన్ కట్టారు. రాజకీయ, వ్యాపార ప్రముఖులు స్వామి వారిని దర్శించుకున్నారు.

ఘట్టుపల్లి వీరాంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు

మండలంలోని ఘట్టుపల్లి వీరాంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివరాత్రి సందర్భంగా భక్తులు ఆలయంలో అభిషేకాలు, హారతి, కుంకుమార్చన భక్తిశ్రద్ధలతో చేశారు. స్వామి వారి దర్శనానికి పెద్ద ఎత్తున బారులు తీరారు.



మహేశ్వరం: స్వామివారి ప్రతిమను అందుకుంటున్న పట్నం సునీతారెడ్డి



మహేశ్వరం: ఆచారి, అందెల శ్రీరాములును సత్కరిస్తున్న ఆలయ కమిటీ



మహేశ్వరం: ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి



మహేశ్వరం: పూజలో జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కృష్ణారెడ్డి



పహాడీషరీఫ్: శ్రీరాం కాలనీలోని మల్లికార్జునస్వామి ఆలయంలో..



మీర్‌పేట: స్వామివారి దర్శనం కోసం వచ్చిన భక్తులు



మంచాల: కల్యాణోత్సవానికి హాజరైన భక్తజనం



యాచారం: నందీశ్వరుడి సేవలో ఎంపీపీ సుకన్య కుటుంబ సభ్యులు

హరిత వనాలు.. ఎండిన మొక్కలు!

రూ.లక్షల్లో ఖర్చు
- సిబ్బంది పర్యవేక్షణ కరువు
- నెరవేరని లక్ష్యం
- పట్టించుకోని ఉన్నతాధికారులు

మొయినాబాద్: గ్రామాలను హరిత వనాలుగా మార్చాలనే లక్ష్యంతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతి గ్రామంలో వన నర్సరీలను ఏర్పాటు చేసింది. దీని కోసం రూ. లక్షల్లో ఖర్చుచేశారు. లక్ష్యాన్ని మాత్రం చేరుకోలేదు. వీటి నిర్వహణపై అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో నర్సరీల్లోని మొక్కలు ఎండిపోవడమే కాకుండా వాటి పెంపకం కూడా తగ్గిపోయింది. అక్కడక్కడ కొన్ని గ్రామాల్లో మొక్కలు పెంచుతున్నా వాటికి నీళ్లు పోయకపోవడంతో ఎండిపోయాయి. 2015 నుంచి హరితహారం పేరుతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతీ సంవత్సరం జులై, ఆగస్టులో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడుతుంది. అందుకోసం అవసరమైన మొక్కలను గ్రామాల్లోనే పెంచాలని ప్రతి ఊళ్లో వన నర్సరీలు ఏర్పాటు చేయించారు. నర్సరీలకు స్థలాలు కేటాయించి మొక్కలు పెంచేందుకు ఉపాధి హామీ పథకం ద్వారా నిధులు విడుదల చేశారు. ప్రతి యేడు వన నర్సరీల నిర్వహణ, మొక్కల పెంపకానికి రూ. లక్షల్లో ఖర్చు పెడుతున్నారు. ఐనప్పటికీ వాటి లక్ష్యం నెరవేరడంలేదు.

మొక్కలు అరకొరే...

నర్సరీల్లో పెంచిన మొక్కలను గ్రామాల్లో నాటితే నిర్వహణలోపంతో అవి పెరిగి పెద్దగయ్యేవి మాత్రం అరకొరగానే ఉన్నాయి. మొక్కల పెంపకానికి, నీళ్లు పోయడానికి రూ. లక్షలు ఖర్చుచేస్తున్నట్లు అధికారులు లెక్కలు చూపిస్తున్నారు. నాటిన మొక్కలు పెగడంలేదు. గతేడాది మొయినాబాద్ వన నర్సరీలో పెంచిన మొక్కలను ఎక్కడా నాటకుండా నర్సరీలోనే ఉంచారు. వాటికి సరైన సమయంలో నీళ్లు పోయకుండా ఎండబెట్టారు. ఈ ఏడాది సైతం మళ్లీ మొక్కలు పెంచే కార్యక్రమం చేపట్టారు. వెంకటాపూర్ వన నర్సరీలో పెంచే మొక్కలకు సక్రమంగా నీళ్లు పోయక అవికూడా ఎండిపోతున్నాయి. ఈ సారి ఎండలు ఎక్కువగా ఉండటంతో చాలా నర్సరీల్లో మొక్కలు ఎండుముఖం పడుతున్నాయి. దీనికి తోడు అధికారుల పర్యవేక్షణ కొరవడింది. ఈ విషయంలో పట్టించుకునే వారు కరువయ్యారు. రికార్డుల్లో మాత్రం వేల సంఖ్యలో మొక్కలు పెంచుతున్నట్లు, అందుకు రూ.లక్షల్లో ఖర్చు చేస్తునట్లు లెక్కలు మాత్రం చూపుతున్నారు. వన నర్సరీల పట్ల అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పుడొచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా వన నర్సరీలపై అధికారులు దృష్టి సారిస్తారో లేదో వేచి చూడాల్సిందే!

బహుజన రాజ్యమే లక్ష్యం

షాబాద్: బహుజన రాజ్య నిర్మాణమే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పనిచేయాలని బీఎస్పీ ఎన్నికల నిర్వహణ ఇన్‌చార్జి విజయ ఆర్య క్షత్రియ పేర్కొన్నారు. శుక్రవారం షాబాద్‌లో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆదేశాల మేరకు పనిచేయాలని పిలుపునిచ్చారు. మాయావతి స్ఫూర్తితో బహుజనులకు రాజ్యాధికారంలో వాటా కల్పించేందుకే పోరాటం విస్తృతం చేయాలన్నారు.

చేవెళ్ల ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్ నియామకం

బీఎస్పీ చేవెళ్ల ఉపాధ్యక్షుడిగా నాగర్‌కుంట గ్రామానికి చెందిన మళ్లీ వెంకటేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు విజయ ఆర్య క్షత్రియ తెలిపారు. అసెంబ్లీ ఇన్‌చార్జి రాజమహేంద్రవర్మ, జిల్లా ఇన్‌చార్జి జామ చంద్రస్, అసెంబ్లీ నియోజకవర్గం అధ్యక్షుడు చందు పాల్గొన్నారు.



నియామకపత్రం అందుకుంటున్న వెంకటేశ్

అతివా నీకు సలాం



మీర్‌పేట: ఎమ్మెల్యే సబితారెడ్డి, ఎమ్మెల్సీ కవితలకు శుభాకాంక్షలు తెలుపుతున్న మీర్‌పేట కార్పొరేటర్లు

ఘనంగా మహిళా దినోత్సవం

మీర్‌పేట: మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం మీర్‌పేట కార్పొరేషన్‌కు చెందిన కార్పొరేటర్లు సిద్దాల లావణ్య, దోమలపల్లి ధనలక్ష్మి, మమతలు కలిసి ఎమ్మెల్యే సబితారెడ్డి, ఎమ్మెల్సీ కవితలకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ లలిత, బీఆర్‌ఎస్ నాయకురాళ్లు పాల్గొన్నారు.

దాసర్లపల్లిలో..

మహేశ్వరం: కందుకూరు మండలంలోని దాసర్లపల్లి గ్రామంలో బీఆర్‌ఎస్ మండల మహిళా అధ్యక్షురాలు, దాసర్లపల్లి ఎంపీటీసీ తాండ్ర ఇందిర ఆధ్వర్యంలో శుక్రవారం మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆమె పేర్కొన్నారు. పురుషులతో సమానంగా మహిళలు రాణించినప్పుడే సమాజం గౌరవిస్తుందన్నారు. అంతకు ముందు మహిళలతో కలిసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తాండ్ర దేవేందర్ పలువురు మహిళలు పాల్గొన్నారు